క్లుప్తంగా

లక్ష్మీనృసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన ఉన్న వేణుగోలస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన లక్ష్మీనృసింహస్వామికి భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'లో పథకాలపై సర్వే



లచ్చయ్యపేటలో వలంటీర్లు నిర్వహిస్తున్న సర్వే

సీతానగరం: జగనన్న సురక్ష కార్యక్రమంతో బహుళ ప్రయోజనాలు సమకూరుతాయని జెడ్పీటీసీ ఎం.బాబీ, లచ్చయ్యపేట సర్పంచ్ సీహెచ్ కృష్ణ అన్నారు. లచ్చయ్యపేటలో పంచాయతీ కార్యదర్శి మురళి ఆధ్వర్యంలో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో కలసి గురువారం ఇంటింటా ప్రభుత్వ పథకాలపై సర్వే చేశారు. పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే వివరాలు సేకరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి పథకాలపై ఆరాతీశారు. ఎంపీటీసీ ఎ.సింహాచలం, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

నెలిపర్తిలో వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న డా.శ్రీకాంత్, సిబ్బంది

సాలూరు: మండలంలోని మామిడిపల్లి పీహెచ్‌సీ వైద్యుడు డా.శ్రీకాంత్ ఆధ్వర్యంలో నెలిపర్తి గ్రామంలో వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. శిబిరంలో 57 మందికి వైద్య పరీక్షలు చేయగా 22 మంది సాధారణ జ్వరాలతో బాధపడుతున్నట్టు గుర్తించారు. వారికి మందులు అందించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమకాటుకు గురికాకుండా ఉండాలని సూచించారు. గ్రామంలో సాధారణ జ్వరాలే నమోదయ్యాయని వారికి మందులు అందించామని డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. గ్రామంలో ఏఎల్‌వో స్ప్రేయింగ్, బ్లీచింగ్ పిచికారీ తదితర ప్రక్రియలను ఆయన పరిశీలించారు.

ప్రతిభ గల విద్యార్థికి ప్రోత్సాహం

మక్కువ: మండలంలోని ఎర్రసామంతవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించి, ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన చందు అనే విద్యార్థికి ఐదేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు అందిస్తానని ఎంఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఉపాధ్యాయుడు మరడ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చందు అనే గిరిజన విద్యార్థి 10వ తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. చందు ఒంగోలులోని ట్రిపుల్ ఐటీలో జాయిన్ అయ్యే ఖర్చుతో పాటు, ఆరేళ్ల పాటు నిర్వాహణ ఖర్చు మొత్తం భరిస్తానని ఆయన తెలిపారు.

జగనన్న లేఅవుట్‌ను పరిశీలించిన పీవో



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

మక్కువ: మండల కేంద్రం మక్కువలోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ గురువారం పరిశీలించారు. జగనన్న లేఅవుట్లో ఇంతవరకు ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి, ఇంకా ఎన్ని మిగిలి ఉన్నాయి తదితర విషయాలను హౌసింగ్ డీఈ సోమేశ్వరరావు, ఏఈ సింహాచలంను అడిగి తెలుసుకున్నారు. 291 ఇళ్లు పూర్తి కాగా, 74 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నట్లు వారు తెలిపారు. జగనన్న కాలనీ నిర్మాణ పనులు వేగవంతంగా జరిపించాలని అధికారులను ఆదేశించారు.

'జగనన్న సురక్ష'తో సమస్యల పరిష్కారం

పాచిపెంట:

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించడానికి దోహదపడుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు అన్నారు. పద్మాపురం గ్రామ సచివాలయంలో సర్పంచ్ బడ్నాన వీరయ్య ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై వలంటీర్లకు సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరంనాయుడు మాట్లాడుతూ గ్రామంలో జగనన్న భూరక్ష, జగనన్న భూహక్కు పథకం ద్వారా రైతులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం అవుతాయన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఏ సమస్యలు ఉన్నా ఆ సంబంధిత శాఖల అధికారులు వాటికి పరిష్కారం చూపుతారన్నారు. ఇంటింటికి రానున్న అధికార సిబ్బందికి ప్రజలు వారు సమస్యలు వివరించి పరిష్కరించుకోవాలని కోరారు. అనంతరం పద్మాపురం గ్రామంలో ఇంటింటికి వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌వో భరత్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బర్ల తులసి ప్రసాద్, పేటూరి లక్ష్మణరావు పాల్గొన్నారు.



పాచిపెంట: మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు

జీగిరాం, కొత్తవలసల్లో..

సాలూరు: మండలంలోని జీగిరాం, కొత్తవలసలో జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, స్థానిక ప్రజాప్రతినిధులు పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డి సురేష్ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు వేణు, సుభాషిణీ, సూరప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. కొత్తవలస సచివాలయంలో స్థానిక సర్పంచ్ నెమలిపిట్ట ధర్మావతి, తహసీల్దార్ మురళీకృష్ణ, నాయకులు సంగంరెడ్డి జయసింహా, నెమలిపిట్ట కల్యాణ్, బొన్నాడ సీతారాం తదితరులు ప్రజలకు ధ్రువపత్రాలు అందజేశారు.



సాలూరు: జీగిరాంలో ధ్రువపత్రాలను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టండి

సీతానగరం: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కాలువల్లో పేరుకుపోతున్న పూడికలను తొలగించాలని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. అంటిపేట, కాశీపేట గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఎంపీడీవో ప్రసాద్, ఈవోపీఆర్డీ కుమారవర్మ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అంటిపేటలో ఆయన మాట్లాడుతూ మండలంలోని మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలుకు కాలువల్లో నీరు నిల్వ ఉండిపోవడం వలన దోమలు ప్రబలే అవకాశం ఉందని, తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ పాలకులు దోమల నివారణకు ముందు జాగ్రత్త చర్యగా పారిశుద్ధ్య పనులు చేయించాలన్నారు. తాగునీటి సరఫరాపై పంచాయతీ పాలకులు, పంచాయతీ కార్యదర్శిలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు టి.ధనంజయమ్మ, బి.తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శులు మురళి, శశిభూషణరావు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

చెల్లన్నాయుడువలసలో బోరు మరమ్మతులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో తాగునీరందక మొరాయిస్తున్న బోర్లుకు మరమ్మతులు చేయిస్తున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ మెకానిక్ సత్యనారాయణ తెలిపారు. గురువారం బోరు మెకానిక్ సిబ్బంది చెల్లన్నాయుడువలస సర్పంచ్ పర్యవేక్షణలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు.

ఎడ్యుకేషన్ అసిస్టెంట్లూ భాగస్వాములే..



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ సింహాచలం

బలిజిపేట: మండల విద్యాశాఖ కార్యక్రమాల్లో సచివాలయాల్లో పనిచేస్తున్న ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు కూడా భాగస్వాములేనని ఎంఈఓ - 1 సామల సింహాచలం తెలిపారు. మండల సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో ఆయన ఎంఆర్‌సీలో గురువారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తూ ఎన్నో పథకాలను అమలు పరుస్తుందని వాటిని సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మండల విద్యాశాఖతో కలిసి మీరు పనిచేయాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా డ్రాపవుట్స్ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి సమాచారాన్ని విద్యాశాఖకు తెలియపరచాలన్నారు. విద్యా విషయక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యాశాఖకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంఆర్‌సీ సిబ్బంది, మండల ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముగిసిన 'జగనన్న సురక్ష' శిక్షణ తరగతులు

పార్వతీపురం టౌన్:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్ల శిక్షణా తరగతులు విజయవంతంగా గురువారం ముగిశాయి. ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదేశాల మేరకు మండల పరిధిలోని 20 సచివాలయాల పరిధిలో షెడ్యూల్ ప్రకారం గ్రామ వలంటీర్లకు శిక్షణ ఇవ్వడం పూర్తయినట్లు జేసీఎస్ మండల కన్వీనర్ బంకపల్లి వాసుదేవరావు తెలియజేశారు. సచివాలయ కన్వీనర్లు గృహసారథులు, వలంటీర్లను సమన్వయం చేసి గ్రామాల వారీగా సమస్యలను గుర్తించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతీ లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలన్న ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా జగనన్న సురక్ష కార్యక్రమం ప్రతి గ్రామ సచివాలయంలో జరుగుతుందన్నారు. వారం రోజుల పాటు గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని 11 రకాల ధ్రువపత్రాలను పూర్తి ఉచితంగా ఇచ్చే విధంగా రూపొందించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ఓ లక్ష్మణరావు, సర్పంచ్ మడక విశ్వనాథం పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు వీరే...



కర్రి షర్మిల | తెంటు యామిని | దమరసింగి లత | కర్రి యోజిత | కర్రి మొనిషా | పి.ప్రవీణ్‌సాయి



డి.జ్ఞానేశ్వరి | జి.గణేష్ | ఎమ్.శైలజ



డి.మధులిక | సాయినిశ్చల్ | చినగుడబ యోజిత

సాలూరు:

పట్టణంలో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల పాఠశాల, గాడివీధి కెఎఎస్.ప్రభుత్వ పాఠశాల, మండలంలో పురోహితునివలస ఆదర్శ పాఠశాలల విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థులు కర్రి షర్మిల, తెంటు యామిని, దమరసింగి లత నూజివీడు ఐఐఐటీకి, కర్రి యోజిత శ్రీకాకుళం, కర్రి మొనిషా ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ మూకల పెంటయ్య తెలిపారు. పట్టణంలో గాడివీధి కెఎయస్.ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదివిన పి.ప్రవీణ్‌సాయి, డి.జ్ఞానేశ్వరి నూజివీడు, జి.గణేష్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. మండలంలో ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి చదివిన ఎం.శైలజకు నూజివీడు, డి.మధులికకు ఒంగోలు, సాయినిశ్చల్ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ అంజలీదేవి తెలిపారు. వీరికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

పార్వతీపురం: బందలుప్పి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన చినగుడబ యోజితకు ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. గురువారం విడుదల చేసిన జాబితాలో యోజితకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు దక్కింది.

పవన్ వ్యాఖ్యలపై నిరసన

ప్రజలకు కరోనా కష్ట కాలంతో పాటు మిగతా రోజుల్లో ప్రభుత్వ పథకాలను, సంక్షేమ ఫలాలను అందజేస్తూ అందరి మన్ననలు పొందుతున్న వలంటీర్లపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు సరికాదని పలువురు ఖండించారు. పవన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, వలంటీర్లకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని వారు పేర్కొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

కరోనాలో ఆదుకున్నారు...



కరోనా కాలంలో వృత్తిపరంగా జీవనోపాధి కోల్పోయాం. నాయీబ్రాహ్మణులంతా తీవ్ర ఇబ్బందులు పడ్డాం. అదే సమయంలో కరోనా సోకింది. ఈ సమయంలో వలంటీరు రాంబాబు నాకు అవసరమైన కరోనా పరీక్షలు చేయించి మందులను కూడా ఇంటికి తెచ్చి ఇచ్చేవారు. ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది వచ్చేలా పర్యవేక్షించారు. వలంటీరు వల్లే ఈ కష్ట సమయంలో బయటపడ్డాం. కుటుంబ సభ్యులు కూడా దరికి చేరని సమయంలో వలంటీరు సేవలందించారు. అటువంటి వలంటీర్లపై పవన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు.

– అలజంగి జగదీశ్వరరావు, నాయీబ్రాహ్మణుడు, పార్వతీపురం

ఆరోపణలు సరికాదు



నా వయసు 50 సంవత్సరాలు. ఒంటరి మహిళను. పింఛన్ వస్తుంది. మా పిల్లలకు అమ్మ ఒడి వస్తుంది. చేయూత, ఆసరా పథకాలు కూడా వస్తున్నాయి. ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చింది. నిర్మాణానికి అవసరమైన సామగ్రిని కూడా అందజేసింది. ఈ పథకాలన్నీ ప్రభుత్వం నియమించిన వలంటీరు వల్లే వచ్చాయి. వలంటీరు ఇంటికి వచ్చి పథకాలు వివరించి దరఖాస్తు చేయించి వచ్చేలా చేశారు. అటువంటి వలంటీర్లపై జనసేన నేత పవన్ విమర్శలు చేయడం తగదు.

– మంగ తాయారు, బలిజిపేట

ఇంటికొచ్చి పింఛన్ ఇస్తున్నారు...



నేను దివ్యాంగుడిని. నడవలేని పరిస్థితిలో ఉన్నప్పుడు వలంటీరు శివ ఇంటికే వచ్చి పింఛన్ అందించేవాడు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ప్రాణాలకు తెగించి సేవలందించాడు. ఎలాంటి ఆధారం లేని నాకు వలంటీరే అన్నీ అయి సేవలందించాడు. అటువంటి వారిపై పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు సరికాదు.

– మర్రాపు సన్యాసినాయుడు, పెద్దూరు

వలంటీరు సేవలు మరువం



నేను జేపీ అపార్టుమెంట్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాను. కోవిడ్ సమయంలో జీవనోపాధి కోల్పోయాను. అదే సమయంలో నాకు కరోనా కూడా సోకడంతో వలంటీరు కక్కుల సంతోష్ రోజూ మందులు అందించడంతో పాటు అన్ని విధాల అండగా నిలిచాడు. ఎన్నో అవస్థల నడుమ వలంటీర్లు ప్రజలకు సేవలందిస్తుంటే పవన్‌కల్యాణ్ విమర్శించడం సరికాదు. పవన్ తన వ్యాఖ్యలను విరమించుకోవాలి.

– పలగర సింహాచలం, పార్వతీపురం

జీలుగు, పచ్చిరొట్ట విత్తనాలతో ప్రయోజనం



నూకలవాడలో పంట పొలాలను పరిశీలించిన కలెక్టర్ నిషాంత్‌కుమార్

బలిజిపేట: జీలుగు, పచ్చిరొట్ట విత్తనాల వలన భూసారం పెరుగుతుందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. నూకలవాడ ఆర్బీకే పరిధిలో ఉన్న పంట పొలాలను గురువారం పరిశీలించారు. పచ్చిరొట్ట, జీలుగు వేసే భూములను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పచ్చిరొట్ట, జీలుగు విత్తనాలు రాయితీపై వ్యవసాయ శాఖ అందించిందా అని ప్రశ్నించారు. దీనిపై రైతులు స్పందించి మొలిచిన పచ్చిరొట్ట, జీలుగును పొలంలో బాగా కలియదున్ని మురగపెట్టడం జరుగుతుందని తెలిపారు. సేంద్రీయ కర్బనం పెరుగుతుందని తెలిపారు. ఎరువుల వాడకం తగ్గుతుందన్నారు. రైతులు ఇచ్చిన సమాచారంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మంచి పంటను వేసి మంచి దిగుబడులు తీసుకురావాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్ పాల్, ఏవో శ్రావణ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నవరత్నాలతో 'సంక్షేమ' కాంతులు

సీతంపేట: రాష్ట్రంలో నవరత్నాలు పేరిట ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పూతికవలస గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న చింతమాను కాలనీ, పీపీ ఈతమానుగూడ, గురండి, చావిడిపాడు, పుట్టిగాం, కోమటిగూడ గ్రామాల్లో గురువారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా ప్రాంతాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి, ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ప్రజల బాగోగుల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పరితపిస్తుంటారని, అందుకే ఆయన అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత ఆయదేనన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలో ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. అలాగే ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మళ్లీ సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజాప్రతినిధులు,అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



సీతంపేట: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గిరిజనులతో మమేకమై, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే

ప్రభుత్వ ధ్యేయం

కురుపాం:

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఒబ్బంగి గ్రామ పంచాయతీ పరిధిలోని ఒబ్బంగి, సాకి, సాకిగూడ, తియ్యాలి, తియ్యాలిగూడ, లిక్కిడి, లిక్కిడిగూడ, తియ్యాలివలస, ఫీరంగూడ, తోలుమానుగూడ, కోసింగూడ, జలుబుగూడ, బుడ్డడుగూడ, రెల్లిగూడ గిరిజన గ్రామాల్లో గురువారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా ప్రాంతాల ప్రజలు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలుచేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. టీడీపీ హయాంలో ఎన్నికలప్పుడు మాత్రమే నాయకులు ప్రజలకు కనిపించేవారని, అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల వద్దకే నాయకులు వచ్చి, సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు మేలు చేయాలన్న దృఢ సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని, అందుకే ప్రతీ కుటుంబానికి మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారన్నారు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. గతంలో టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు పాలనలో స్పష్టమైన తేడా ఉందన్నారు. గతంలో ఏ రకమైన ప్రభుత్వ సేవలు కావాలన్నా మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు గ్రామ సచివాలయాల్లోనే ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు దొరుకుతున్నాయన్నారు. మరోసారి టీడీపీ అండ్ కో అబద్ధపు హామీలతో మోసగించేందుకు సిద్ధమైందని, ప్రజలు గమనించాలన్నారు. సీఎం జగనన్నతోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు.

కార్యక్రమంలో ఒబ్బంగి గ్రామ సర్పంచ్ నూకాలమ్మ, నీలకంఠాపురం సర్పంచ్ అడ్డాకుల మన్మథరావు, కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, జెడ్పీటీసీ సుజాత, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆనిమి ఇందిరా కుమారి, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, మొండెంఖల్ ఎంపీటీసీ గుడారి విద్యారాణి తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి